

ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో అభివాదం చేస్తున్న వద్దిరాజు రవిచంద్ర, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు, ఓబీసీ సంఘాల నేతలు, తదితరులు

# కులగణన జరగాలి.. రాజ్యాధికారం దక్కాలి


- మా ఓట్లు కావాలి.. సముచిత స్థానం కల్పించరా?
- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఓబీసీ నేతల మహాధర్నా
- ఆందోళనలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు వద్దిరాజు, మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ సీనియర్‌నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో బీసీల ఓట్లు అడుగుతారు కానీ.. రాజ్యాధికారంలో సముచిత స్థానం ఎందుకు కల్పించడం లేదంటూ బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నించారు. దేశ జనాభాలో 60శాతానికి పైగా ఓబీసీలకు అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఓబీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, సీనియర్‌నేతలు బడుగుల లింగయ్య యాదవ్, బీద మస్తాన్‌రావు, పురుషోత్తమరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, కులగణన చేయాలని చేపట్టాలని, చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ హయాంలో సముచిత న్యాయం

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో బీసీలకు సముచిత ప్రాధాన్యత లభించిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో బీసీలు ఇద్దరే ఉన్నారని, త్వరలో భర్తీ కానున్న 6 స్థానాలలో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో ఓబీసీలకు న్యాయమైన వాటా దక్కేంత వరకు బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా గొంతెత్తి నినదిస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు సిద్ధేశ్వర్, కిరణ్, వేల్పుల శ్రీనివాస్, పర్వతం సతీశ్, అరుణ, చామకూరి రాజు, డీ వేలాద్రి, కేవీ గౌడ్, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి



కాశీబుగ్గ, డిసెంబర్ 12: దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్‌కు పోస్టుకార్డు ద్వారా లేఖలు రాసినట్టు బీజేపీ రాష్ట్ర నాయకుడు సముద్రాల పరమేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన వరంగల్ నగరంలో మాట్లాడుతూ వరంగల్ జిల్లా గీసుగొండలోని గోశాలకు నిబంధనలకు విరుద్ధంగా గోవులను కేటాయించినట్టు అధికారుల దర్యాప్తులో తేలినందున వెంటనే కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# ఒత్తిళ్లే రాజన్న కోడెలకు శాపాలు!

- స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి మంత్రుల దాకా సిఫారసులు
- నో చెప్తే అధికారులకు బెదిరింపులు
- తీగ లాగితే కదులుతున్న డొంక?
- ఆరు నెలల్లో 1734 కోడెల పంపిణీ
- అందులో ఉన్నవెన్ని? కబేళాకు తరలినవెన్ని? అనే అనుమానాలు
- నామామాత్రపు విచారణ దిశగా దేవాలయ అధికారుల అడుగులు
- ప్రత్యేక యాప్, జియో ట్యాంగింగ్ ద్వారా మెరుగైన ఫలితం ఉంటుందన్న నిపుణులు



కరీంనగర్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/వేములవాడ: వేములవాడ రాజన్న కోడెలు పక్కదారి పట్టడానికి మితిమీరిన రాజకీయ జోక్యమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. నాయకుల అండదండలతోనే కొంతమంది అక్రమార్కులు వాటిని ఇష్టానుసారం తీసుకెళ్లి కబేళాలకు అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజన్న కోడెలను తమ అనుచరులకు ఇవ్వాలంటూ స్థానిక రాజకీయ నాయకుల నుంచి మంత్రుల వరకు చేస్తున్న పైరవీలు, అధికారులపై ప్రయోగిస్తున్న ఒత్తిళ్లు కోడెల ఉనికినే ప్రశ్నార్థంగా మార్చేస్తున్నాయి. వాటిని సమర్పించిన భక్తుల విశ్వాసంపై దెబ్బ కొడుతున్నాయి. ఈ తీరు మారాలంటే ప్రభుత్వం మరింత పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### నిబంధనలు సరే ఆచరణ ఏదీ?

రాజన్న కోడెలను గతంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో గుర్తింపు పొందిన గోశాలలకు వారి వారి అభ్యర్థన మేరకు ఇచ్చేవారు. జనవరిలో కొన్ని అక్రమాలు బయటపడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా, దేవస్థానం ఈవో కన్వీనర్‌గా వివిధ శాఖల అధికారులతో ఒక కమిటీని నియమించారు. మే లో ఈ కమిటీ ఏర్పాటు కాగా, జూన్ ఒకటి నుంచి కమిటీ నియమ, నిబంధనలకు అనుగుణంగా కోడెలను పంపిణీ చేస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. దేవస్థానం గోశాలలో కోడెలు అదనంగా ఉన్నప్పుడు నిజమైన రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం కోడెలను ఇవ్వాలనేది కమిటీ నిబంధన. రైతుగా వ్యవసాయ అధికారి ధ్రువీకరణ పత్రం, సదరు రైతు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వంటి వివరాలు సేకరించి.. జిల్లా వెటర్నరీ అధికారుల సమక్షంలో పంచనామా చేసి.. సంబంధిత రైతులకు కోడెలను ఇవ్వాలని కమిటీ నిబంధన పెట్టింది. కోడెలు సదరు రైతులకు ముట్టినట్టు సంతకం తీసుకోవాలి. ఒకవేళ కోడెలను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా అంగీకారపత్రం కూడా తీసుకోవాలి. ఒకవేళ సదరు రైతు తాను తీసుకెళ్లిన కోడెలను ఏదైనా కారణంతో పోషించలేని పరిస్థితి వస్తే, వాటిని తిరిగి గోశాలకు అప్పగించవచ్చు. ఒకవేళ, తాము తీసుకెళ్లిన కోడెలు చనిపోతే గ్రామ అధికారితో ధ్రువీకరణ పత్రం తెచ్చి దేవాలయ అధికారులకు సమర్పించాలి. ఈ నిబంధనలు గత జూన్ నుంచి అమల్లోకి వచ్చాయి. నిబంధనలు బాగానే ఉన్నా ఆచరణలో అందకు భిన్నంగా సాగుతున్నది. దీనికి నిలువెత్తు నిదర్శనం తాజాగా గీసుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన అంశం. కేవలం ముగ్గురు వ్యక్తులు వచ్చి.. బినామీ రైతుల పేర్లతో 66 కోడెలను తీసుకెళ్లి, అందులో 28 కోడెలను కబేళాకు విక్రయించిన తీరు నిబంధనల పాతరకు నిలువెత్తు నిదర్శనం.

### మితిమీరుతున్న రాజకీయ జోక్యం

కమిటీ నిబంధనల ప్రకారం మొదట్లో అధికారులు పకడ్బందీగానే పంపిణీచేసే ప్రయత్నం చేశారు. అసరం ఉన్న రైతులు దేవస్థానం గోశాలకు ప్రత్యక్షంగా నేరుగా వస్తే వారి ఫొటోలు తీసుకొని.. తగిన పత్రాలు పరిశీలించి పంపిణీ చేసే ప్రయత్నం చేశారు. కానీ, అతి కొద్ది సమయంలోనే ఈనిబంధనలకు నీళ్లొదిలారు. వివిధ ప్రాంతాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధుల జోక్యం పెరిగింది. స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు.. యాభైమందికిపైగా వ్యక్తులను సిఫారసు చేసినట్టు తెలుస్తున్నది. ఎవరైనా దరఖాస్తు చేస్తే చాలు.. ఆయా ప్రజాప్రతినిధులు దానిని ఎండార్స్ చేస్తూ అధికారుల వద్దకు పంపిస్తున్నారు. కొంతమంది ప్రజానిధులు సిఫారసు లేఖలు పంపిస్తే, మరికొందరు తెల్ల కాగితంపై చీటీలు రాసి పంపిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇలా ఒత్తిళ్లు ప్రయోగిస్తున్న వారిలో మెజార్టీ వ్యక్తులు నిజమైన రైతులు కారు. వ్యాపారానికి రుచి మరిగిన కొంతమంది ఈ పైరవీలకు అలవాటు పడ్డారని తెలుస్తున్నది. వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఎండార్స్ చేసిన లేఖలను తీసుకొచ్చి అధికారులపై సదరు వ్యక్తులు ఒత్తిళ్లు తెస్తున్నట్టు సమాచారం. తాము నో చెప్పడానికి కూడా అవకాశం ఇవ్వడం లేదని ఒక అధికారి తెలిపారు. కోడెలు ఇవ్వడం కుదరదని చెప్తే, సదరు ప్రజాప్రతినిధుల నుంచి నేరుగా ఫోన్లు వస్తున్నాయని అధికారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కోడెలను ఇస్తున్నారని తెలుస్తున్నది. తాజాగా వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ముగ్గురు వ్యక్తులకు 66 కోడెలు ఇచ్చిన వ్యవహారం వెలుగు చూడటం అందులో భాగమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకెళ్లిన వాటిలో 28 కోడెలను కబేళాకు విక్రయించడం దారుణం. తాజాగా వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వెలుగు చూసిన ఒక సంఘటన మాత్రమే ఇది. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత గత జూన్ ఒకటి నుంచి నవంబర్ వరకు 1,734 కోడెలను రైతులకు పంపిణీ చేసినట్టు అధికారులు చెప్తున్నారు. అందులో ప్రస్తుతం రైతుల వద్ద ఉన్నవి ఎన్ని? కబేళాకు తరలినవి ఎన్ని? చనిపోయిన వాటి సంఖ్య ఎంత? కబేళాకు గీసుకొండ మండలం నుంచి మాత్రమే తరలిస్తున్నారా? మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే దందా నడుస్తున్నదా? అన్న అంశాలపై లోతుగా విచారణ జరిపితే తప్ప వాస్తవాలు బయటకు రావు. నిజంగా ఈ తరహా వ్యాపారం ఒక్క గీసుకొండలో మాత్రమే జరిగిందా? లేక ఇతర మండలాల్లోనూ కొనసాగుతున్నదా? అన్నది తెలియాలంటే ప్రభుత్వం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయాలి. దేవాలయ అధికారులు పంపిణీ చేసిన జాబితా ప్రకారం సంబంధిత పోలీసుస్టేషన్ల ద్వారా సమగ్రంగా విచారణ జరిపిస్తే మొత్తం అక్రమాలు బయటపడతాయని, కబేళాకు ఇంకా ఎవరెవరు తరలిస్తున్నారనే లింకులు బయటపడతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, దేవాదాయ శాఖ ఈ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కేవలం ఇద్దరు అధికారులను వరంగల్ ఉమ్మడి జిల్లాకు పంపించి నామమాత్రపు విచారణ చేయిస్తున్నారన్న విమర్శలున్నాయి.

### అడ్డుకట్ట ఇలా..?

అక్రమ విక్రయాలకు అడ్డకట్ట వేయాలంటే, సాంకేతిక రంగాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పంపిణీ వ్యవస్థ అంతా కాగితాల మీదనే అమలవుతున్నది. దేవస్థానం అధికారులు రికార్డులు రాసుకోవడం, అందులో ఏ గ్రామ రైతుకు ఎప్పుడు, ఎన్ని కోడెలు ఇచ్చారన్న వివరాలు బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచడం వంటివి చేస్తున్నారు. ఒకే ఆధార్‌కార్డుపై తీసుకెళ్లిన వారే మళ్లీ మళ్లీ తీసుకెళ్తున్నారు. ఇలాంటివాటిని అడ్డుకోవడానికి ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారుచేసి, అందులోనే కోడెలు అవసరం ఉన్న రైతులు నేరుగా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు. దరఖాస్తుదారుల వివరాలు సైట్‌లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలని, అప్పుడే, దొంగల భరతం పట్టేందుకు అవకాశం ఉంటుందని చెప్తున్నారు. ఒకసారి ఒక ఆధార్‌కార్డు ఎంట్రీ అయితే, మళ్లీ అదే ఆధార్‌కార్డు పేరిట ఎంట్రీకి అవకాశం లేకుండా చూడాలి. అప్పుడు ఒకే వ్యక్తి పదేపదే తన అధార్‌కార్డుపై కోడెలను తీసుకెళ్లడానికి అవకాశం ఉండదు. రైతులకు ఇచ్చే కోడెలకు జియోట్యాగింగ్ చేయాలి. ఏ గ్రామ రైతుకు ఎన్ని కోడెలు ఇచ్చారో తెలుపుతూ సంబంధిత గ్రామ కార్యదర్శులకు అదేశాలు వెళ్లేలా టెక్నాలజీ ఉండాలి. ముఖ్యంగా ఈ వివరాలను పంచాయతీ, రెవెన్యూ అధికారులతో అనుసంధానం చేస్తే.. తప్పులు జరగకుండా ఉండే అవకాశంతోపాటు నిజమైన రైతులకు రాజన్న కోడెలు ఉపయోగపడుతాయి. దరఖాస్తుదారుల సీనియారిటీ ప్రకారం, ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే అందులో అర్హులైన వారికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. తద్వారా రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది.

## బీఆర్‌ఎస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి

ఏపీ మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్



హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని ఏపీ మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. వైసీపీకి రాజీనామా చేసిన సందర్భంగా గురువారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ కంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందిందని అన్నారు.

## మున్నూరుకాపులకు తోడ్పాటు అందించాలి

కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి



హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): మున్నూరు కాపు సహకార సంఘానికి తోడ్పాటును అందించాలని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావుతో కలిసి ఢిల్లీ ఉద్యోగ్ భవన్‌లో గురువారం కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మున్నూరుకాపు సంఘం నేతలు అరుణ, రవీందర్, శ్రీనివాస్, సతీశ్, సంపత్, మహేందర్, బాలరాజ్ తదితరులు మంత్రిని కలిసి తమ సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

## దవాఖానల పర్యవేక్షణకు ప్రత్యేక పోర్టల్

హైదరాబాద్, డిసెంబర్12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల పర్యవేక్షణకు పోర్టల్ తీసుకురావాలని మంత్రి రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.దవాఖానలో, భద్రత, పరికరాల నాణ్యత, మందుల లభ్యతను తెలుసుకునేలా పోర్టల్ ఉండాలని చెప్పారు. అధికారులతో గురువారం రాజనర్సింహ సమీక్షించారు. దవాఖానలు తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు నివేదికను సమర్పించాయి.

## మాదిగ కళాకారులకు గుర్తింపు ఇవ్వరా?

- మాలలకే ప్రాధాన్యమా?
- జనవరి 27న 'వెయ్యి గొంతులు- లక్ష డప్పులు'
- మీడియా సమావేశంలో మంద కృష్ణమాదిగ



ఖైరతాబాద్, డిసెంబర్ 12 : కవులు, కళాకారులకు పోర్ట్సిటీలో 300 గజాల స్థలంతో పాటు రూ.కోటి నజరానా ఇస్తామన్న ప్రకటనలో మాదిగలను ఎందుకు గుర్తించలేదని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మాదిగల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన మాజీఎమ్మెల్యే రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజు లాంటి కళాకారులను ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. అరుణోదయ విమలక్క లాంటి ఎందరో కళాకారులను ఎందుకు గుర్తించలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం విషయానికి వస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఓ సమావేశంలో అన్నట్టు.. తెలంగాణ తల్లి విగ్రహ రూపం తన తల్లిని చూసినట్టే ఉందని పేర్కొన్నారని, దీనిని బట్టి ఆయన తల్లి రూపాన్నే పెట్టినట్టు అనిపిస్తుందని పేర్కొన్నారు. బహుజనుల రాజ్యంలో తెలంగాణ తల్లులుగా చాకలి ఐలమ్మ, తొలి తెలంగాణ ఉద్యమకారిణి సదాలక్ష్మి విగ్రహాలను పెట్టి స్మరిస్తామని తెలిపారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బహుజన కళాకారుల అస్థిత్వాన్ని చాటుతూ జనవరి 27న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' కార్యక్రమాన్ని చేపడుతామని తెలిపారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా తిరిగి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో కళాకారులు, ఎమ్మార్పీఎస్ లీడర్లు ఏపూరి సోమన్న, నరేశ్‌మాదిగ, అశోక్‌మాదిగ, శరత్, రాంనర్సయ్య, అనిల్, అశోక్, రమేశ్, రామస్వామి, స్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

# బయ్యారంపై కిషన్‌రెడ్డి ప్రకటన దారుణం

- పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రంపై రాష్ట్రం ఒత్తిడి తేవాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- 14న తెలంగాణ జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశం
- కవితతో సగర, వంశరాజుల సంఘాల నేతల భేటీ



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఘనంగా సత్కరిస్తున్న సగర, వంశరాజుల సంఘాల నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొనిరావాలని కోరారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యంకాదంటూ లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే ఒక్కరు కూడా బయ్యారం ఉక్కుపై స్పందించక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఉక్కు పరిశ్రమ కోసం డిమాండ్ చేశారని, ఇప్పుడు మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేయాలని రాష్ట్ర విభజన చట్టంలోనే ఉన్నదని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అమలు చేయాల్సిందేనని చెప్పారు.

### బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు

'బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు' అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామని కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం రాకముందే 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. బయ్యారం ప్రాంతంలో 1.41 లక్షల ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకు పైగా ఐరన్‌ఓర్ నిల్వలు ఉన్నాయని, అక్కడ ఉక్కు పరిశ్రమ స్థాపిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేసీఆర్ సోదాహరణంగా కేంద్రానికి వివరించారని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కావడానికి అవసరమైన మరో 100 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్‌ను ఛత్తీస్‌గఢ్ నుంచి తీసుకొచ్చేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో కేసీఆర్ మాట్లాడారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

### కవితతో సగర, వంశరాజుల సంఘాల భేటీ

తెలంగాణ సగర, వంశరాజుల సంఘాల నాయకులు గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తన నివాసంలో వేర్వేరుగా కలిశారు. డెడికేటెడ్ కమిషన్‌కు ఇటీవల బీసీ కుల గణనపై నివేదిక సమర్పించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వంశరాజుల సంఘం నేతలు బొల్ల శివశంకర్, ఇదిగిచ్చే మురళీకృష్ణ, చిందం పాండు, నిమ్మల వీరన్న, సగర సంఘం నేతలు శెన్‌శెట్టి విజయేంద్రసాగర్, ఎస్పీపీ శ్రీనుసాగర్, బోశెట్టి భాస్కర్‌సాగర్, శ్రీధర్‌సాగర్, గోపీసాగర్, చెన్నయ్యసాగర్, సిద్ధి రాములుసాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావించాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రసాగర్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తాము బీసీ-డీలో ఉన్నామని, బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తాము సంచారజాతులుగా ఉంటూ ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక రంగాల్లో వెనుకబడి ఉన్నామని, తమ సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలని వంశరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి పాండు కోరారు.

### ఆశాలను తొలగిస్తే పోరాటమే

ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తమ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉన్నదని, అలాంటిది జరిగితే మరో పోరాటం తప్పదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఆశా వర్కర్లను తొలగించాలన్న ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని గురువారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

### 14న జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశం

తెలంగాణతల్లి రూపురేఖలు మార్చి తెలంగాణ సంస్కృతి, అస్థిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి, అధికారిక ఉత్సవాలు, వేదికలపై విషసంస్కృతిని ప్రవేశపెట్టడంపై ఈ నెల 14న సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో మేధావులు, కళాకారులు, కవులు, రచయితలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

# రేవంత్.. చాయ్ తాగినంత టైం దొరకలేదా?

- సర్వశిక్షా అభియాన్,ఆశాల సమస్యలు ఎందుకు పట్టించుకోరు?
- ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎప్పుడు తెరిపిస్తరు?
- బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి జోగు రామన్న వెల్లడి



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న జోగు రామన్న, అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, ఆశా వర్కర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడంలేదని మాజీమంత్రి జోగు రామన్న ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి సమస్యలను చాయ్ తాగినంత సేపట్లో పరిష్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో రేవంత్ హామీ ఇచ్చారని, 365 రోజులు దాటినా చాయ్ తాగినంత సమయం దొరకలేదా? అని ప్రశ్నించారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో మూసేసిన సిమెంట్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని, ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు రైల్వేలైన్ వేయిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుదిశగా ప్రయత్నిస్తలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ నేతలమంతా కలిసినట్టు చెప్పారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్న ఉదంతాలను కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ అంశాలు లేవనెత్తాలని, కోరినట్టు చెప్పారు. సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, నాయకులు రామకిషన్‌రెడ్డి, శ్యాంసుందర్, కిరణ్‌కుమార్, చారులత, సుధాకర్, శ్రీరామ్, తిరుమల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల పరిధిపై విచారణ వాయిదా

ఈ నెల 24న విచారించనున్న సుప్రీంకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ ఉమ్మడి ప్రాజెక్టులను రివర్ బోర్డులకు అప్పగించాలన్న కేంద్రం గెజిట్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. జలవిద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన జీవో 34ను రద్దుచేయాలని ఏపీ సర్కార్ కూడా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్లు జస్టిస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఒకే ధర్మాసనం విచారించే అంశాన్ని సీజేఐ ముందుపెట్టి, అనుమతి తీసుకోవాలని సూచిస్తూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.



సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలగోని బాల్‌రాజుగౌడ్ తదితరులు

# 6% రెడ్లకు 4 పదవులా?

## 60% జనాభా ఉన్న బీసీలకు రెండే పదవులా?

- కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం తప్పదు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర విమర్శలు
- విస్తరణలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, రవీంద్రభారతి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. జనాభాలో 60శాతమున్న బీసీలకు 2, 6శాతం జనాభా కలిగిన రెడ్లకు సీఎం సహా 4 మంత్రి పదవులు కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. కనీసం విస్తరణలోనైనా బీసీలకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాబినెట్ విస్తరణపై చర్చించేందుకే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఢిల్లీ వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నదని అన్నారు. భట్టివిక్రమార్క బడుగు బలహీనవర్గాలకు జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడకుండా ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రిపదవి కట్టబెట్టేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కులగణన నిర్వహించాలని, జనాభా దామాషా ప్రకారం పదవుల్లో అవకాశం కల్పించాలని మాట్లాడే రాహుల్‌గాంధీ తెలంగాణలో ఆ సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. బీసీల్లోని చాలా వర్గాలకు ఇప్పటివరకు మంత్రివర్గంలో చోటు దక్కలేదని అన్నారు. నామినేటెడ్ పోస్టులు, సలహాదారుల నియామకాల్లోనూ సామాజిక న్యాయం పాటించాలని కోరుతూ త్వరలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌కు లేఖ రాస్తామని చెప్పారు. బీసీ కులాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్ మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు గౌడ కులస్తులపై దాడులను పాల్పడుతున్నారని, వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దాడులు ఆపకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పకతప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల ప్రతినిధులు గణేష్‌చారి, విక్రమ్‌గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, మల్లయ్య, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

# కులం పేర్లను మార్చండి

## బీసీ కమిషన్‌కు పలు కులాల నేతల విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తమ కులం పేర్లను మార్చాలని కోరుతూ పలు కులాల నేతలు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను దొమ్మర, వంశరాజ్, తమ్మలి తదితర కులాల ప్రతినిధులు గురువారం ప్రత్యేకంగా కలిశారు. తమ కులం పేరును గడ వంశీగా మార్చాలని దొమ్మర, తమ పేరులో నుంచి పిచ్చిగుంట్ల అనే పదాన్ని పూర్తిగా తొలగించాలని వంశరాజ్, నాన్ బ్రాహ్మిణ్, శూద్రా క్యాస్ట్ పదాలను తమ కులం నుంచి తొలగించాలని తమ్మలి కులస్తులు విజ్ఞప్తి చేశారు. ఆయా పదాలతో తాము సమాజంలో అనేక అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కమిషన్‌ను కలిసిన వారిలో ఆయా కులాల ప్రతినిధులు ఆరే రాములు , మురళీకృష్ణ , వటపత్ర సాయి తదితరులు ఉన్నారు.